# తల్లిపాలు

"అమ్మా!

...కె.కె.ని పార్టీ నుండి బహిష్కరించేందుకు రంగం సిద్ధమైంది. బహిష్కరించక ముందే రాజీనామా ప్రకటన ఇచ్చి తమ పార్టీలో చేరాలని రెండు జాతీయ పార్టీలు కె.కె. ని సాదరంగా ఆహ్వానిస్తున్నాయి. నాకు అదే సరైందనిపించింది. కె.కె. వినలేదు. పార్టీలు మారడంపై కె.కె.కి ఆసక్తి లేదు. 30ఏళ్లు గా నమ్ముకున్న పార్టీయే ద్రోహం చేస్తుంటే కొత్తగా చేరిన పార్టీలు ఎంత కాలం గౌరవిస్తాయి అంటాడు. షాక్‌లో ఉన్నాడు. నా ఉద్దేశ్యం ఏంటంటే 30ఏళ్లుగా పని చేస్తున్న కె.కె. గతే పార్టీలో యిలా ఉన్నప్పుడు ఈ పార్టీలో నా భవిష్యత్తు వెతుక్కోవడం అవివేకం అన్పిస్తుంది. బహిష్కరణ ప్రకటన వెలువడక ముందే రాజీనామా ప్రకటన యివ్వండి అని మేం ఒత్తిడి చేశాం.

కె.కె. ఆలోచన వేరు. బతుకుపొద్దు పడమటికి వంగింది. ఇప్పుడు పార్టీలు మారి పదవులు, హోదాలు పొందడం వల్ల తనకు గానీ, ప్రజలకు గానీ ఒరిగేదేమీ లేదు. చరిత్రలో పార్టీ బహిష్కృతుడుగా యిన్నేళ్ళ కృషికి ముద్ర వేయించుకోవాలా... అంత కానిపని ఏం చేశాను. పార్టీలో బి.సిలకు, ఎస్సీలకు సరైన స్థానం యివ్వడం లేదు. నాకన్నా జూనియర్స్‌ని రాష్ట్ర కమిటిలోకి తీసుకున్నారు. ఎమ్మెల్లే టికెట్ యిచ్చి గెలిపించారు. నాకీ అర్హతలు లేవా! ఈసారి పార్టీ నాకా అవకాశం ఇవ్వాలి. అన్ని వనరులు సమీకరించి పార్టీ తరపున నన్ను గెలిపించాలి అని అడగడం తప్పా! నాకన్నా జూనియర్స్ ఎలా ఎగబాకారో చర్చకు పెట్టడం వాళ్ళను విమర్శించినట్టవుతుందా! అని కె.కె. వాదన.

అమ్మా! నువ్వు ఏమైనా అను. నాకీ పార్టీపై భ్రమలు పోయాయి. కె.కె.ను వదిలి నా భవిష్యత్తు నేను వెతుక్కోదల్చుకున్నాను. కె.కె.తో సహా అందరం పార్టీ మారే విషయమై రెండు జాతీయ పార్టీల్తో చర్చలు జరుపుతున్నాను. అంతలోనే ఈ సంఘటన జరిగింది. కె.కె. యిలా చేస్తాడని మేం ఎవరమూ అనుకోలేదు. అరుణక్క సకాలంలో చూడ్డం వల్ల బతికాడు. ప్రస్తుతం హాస్పిటల్‌లోనే ఉన్నాడు. ప్రాణ స్నేహితులనుకున్న పార్టీ స్నేహితులెవ్వరూ పలకరించడానికైనా హాస్పిటల్‌కు రాలేదు. నా నిర్ణయం మరింత బలపడింది. కాని ఎవరూ చూడ్డానికి రాలేదన్న విషయం కోమా నుండి మేల్కోన్నాక కె.కె.కి తెలిస్తే ఈ సారి ఆ షాక్‌తో నిజంగానే చనిపోవచ్చు. అతని ఆత్మహత్యా ప్రయత్నం ఒక పొలిటికల్ స్టంట్... సానుభూతి సంపాదించడం కోసం వేసిన ఎత్తుగడ... పార్టీని అప్రదిష్టపాలు చేయాలని కాకపోతే అతను ఆత్మహత్యకు ఎందుకు ఒడిగట్టాడు అని దుష్ప్రచారం మొదలైంది. కె.కె. ఆత్మహత్యా ప్రయత్నాన్ని కూడా యింత ఘోరంగా వక్రీకరిస్తుంటే

అలాంటి పార్టీలో యింకా కొనసాగాల్సివస్తున్నందుకు నాపై నాకు చాలా అసహ్యంగా ఉంది. అమ్మా! ఇంత ఆపద సమయంలో తనని వదిలివెళ్ళాడని కె.కె. షాకవుతాడనే ఒకే ఒక్క కారణంతో ఓపిక వహిస్తున్నాను.

అమ్మా! రాజకీయాలు మునుపటిలా నువ్వు ఊహిస్తున్నంత ఆదర్శవంతంగా, ప్రేమ పూరితంగా లేవమ్మా! అన్ని పార్టీల్లోలాగే ఈ పార్టీలో కూడా తమ వ్యక్తిగత, గ్రూపు ప్రయోజనాల కనువుగా ఆలోచిస్తూ అదే పార్టీ ప్రయోజనం అని ప్రచారం చేసే దృక్పథం బాగా పెరిగిపోయింది. ఇన్నేళ్ళుగా పార్టీ అధికారం అందుకోగలిగే స్థాయికి ఎదగక పోవడానికి కారణం ఇదే. సీనియర్ నాయకుల్లో చాలా మందికి పార్టీలో, పదవుల్లో భద్రత ఎక్కువై చొరవ కోల్పోయారు. కాకపోతే ఒక పార్టీ పుట్టి పెరిగి తొమ్మిది నెలల్లో అధికారంలోకి రాగలిగి దశాబ్దాల చరిత్ర ఉన్న మన పార్టీ దానితో సీట్ల సర్దుబాటు చేసికొందే గానీ తానే ఒక అధికార పార్టీగా ఎదిగేందుకు తన నాయకత్వంలో ఐక్య సంఘటనకు కృషి చేయక పోవడానికి కారణాలు ఏమని చెప్పగలం?

కె.కె. పార్టీలోంచి వెళ్ళిపోతే లాభపడేవాళ్ళంతా అతను వెళ్ళిపోతేనే బాగుంటుందను కొంటున్నారు. ఇలాంటి స్థితిలో అతను రాజీపడి ఉండదల్చుకున్నా, నేనుండదల్చుకోలేదు. నన్ను అర్థం చేసుకుంటావని విశ్వసిస్తున్నాను. కె.కె.ని చూడ్డానికి వీలు చూసుకొని రాగలవు. అన్ని విషయాలు మాట్లాడుకుందాం. ఉంటాను.

-నీ ఉదయ్

ఉత్తరం చదవడం పూర్తి చేయక ముందే విమల వలవలా ఏడ్చేసింది. కె.కె. తనకు తండ్రిలాంటివాడు. తనకు రాజారాంతో మీటింగ్ పెళ్ళి జరిపింది కె.కె.నే. అప్పుడు అమ్మానాన్నల్ని ఒప్పించడానికి కె.కె. చూపిన చొరవ, ప్రేమ తాను ఎన్నడూ మర్చిపోలేదు. ఉదయ్‌కు ఆ పేరు పెట్టింది కూడా కె.కె.నే. ఓల్గాకు మంచి సంబంధం వెతికి ముత్యంలాంటి మోహన్‌తో పైసా కట్నం లేకుండా పెళ్ళి జరిపింది కె.కె.నే.

కె.కె. తనకు తండ్రి కన్నా ఎక్కువ. ఒక తండ్రి చేయగలిగిందానికన్నా ఎక్కువగా తన కోసం చేశాడు. అందుకే ప్రేమగా తాను ఎప్పుడూ బాపూ అనే పిలుస్తుంది. కాని ఉదయ్‌తో తాతయ్యా అని పిలిపించుకోవడం కన్నా కె.కె. అని పిలిపించుకోవడానికే ఎక్కువ ఇష్టపడ్డాడు. '' విమలా! వీడు నన్ను తాతయ్యా! అని పిలుస్తుంటే నేను అప్పుడే ముసలివాన్నయిపోయానా? అని బాధ కలుగుతుంది. తాతయ్యా అనే వరుస వీడికి నన్ను దూరం చేస్తూ సాన్నిహిత్యం పెరగనీయదేమో...'' అన్న కె.కె. ఈ వయస్సులోనూ ఎంత ఉత్సాహంగా ఉండేవాడు. ఇలా ఎందుకు చేశాడు.

పనులన్ని ఆదరాబాదరగా వదిలేసి తయారై బయల్దేరింది విమల.

* * * *

హాస్పిటల్‌లో కె.కె.ని ఆ స్థితిలో చూసి విమలకు దుఃఖం ఆగడం లేదు. పలకరించడానికి ఎవరూ లేని దీనస్థితి విమలకు మరింత దుఃఖం తెప్పించింది. అమ్మ రావడం ఉదయ్‌కు చాలా ఊరట కలిగించింది. ఆ ఉత్తరం చూసి అమ్మ ఒక్క క్షణం కూడా అక్కడ ఉండదని తెల్సు. అమ్మ హృదయం తనకు తెల్సు.

'' అమ్మా! కె.కె. గురించి ప్రాణం యిచ్చేవాళ్ళున్నారు. వాళ్ళకీ విషయం తెలపాలి'' అన్నాడు ఉదయ్.

''ముందు కె.కె. కొడుకు కోడలుకు ఫోన్ చెయ్యి '' అంది విమల.

'' వాళ్ళకు అదే రోజు రాత్రి ఫోన్ చేసిన. ఇంకా రాలేదు. చనిపోయాడని తెలిపితే వస్తారేమో'' కాస్త కోపంగా అన్నాడు ఉదయ్.

'' ఏం మాటలురా అవి. ఎంతైనా కన్నతండ్రిగదా. లీవు దొరకక రాలేదేమో...''

'' అమ్మా! ఈ సమయంలో లీవు కావాలా? అసలు విషయం నీకు తెల్సు. అయినా అమ్మలు ఎప్పుడూ క్షమించడానికి రెడీగా ఉంటారని ఋజువు చేసికొన్నావు. '' అంటూ క్యారియర్ తేవడానికి బయటకు నడిచాడు ఉదయ్.

విమల కోమాలో ఉన్న కె.కె. మంచం దగ్గర ఒంటరిగా మిగిలిపోయింది. ఏవేవో ఆలోచనలు...

పెళ్ళి చేసికొని వేరుపడిపోయిన కె.కె. కొడుకంటే తనకు ద్వేషం ఏమిలేదు. కె.కె. కోసం వచ్చిన వాళ్ళందరికీ పెట్టడానికి కోడలుకు చాకిరి ఒక్కటే పెరగలేదు. ఏ సంపాదనాలేని తండ్రి రాజకీయాలకు, పార్టీ మిత్రులకు వండి పెట్టడానికి ఎక్కడి జీతమూ చాల్లేదు. ఆరోజు సూర్యంకు ఏడుపొక్కటే తక్కువ...

'' విమలక్కా! నేనీ చాకిరి చేయలేను. నేను ఆయన భావాలతో ఏకీభవించనని తెల్సు. తినిపోయే అందరికి తెల్సు. బిల్లివ్వనవసరం లేని హోటల్లా వచ్చి తినిపోతుంటే ఎక్కన్నించి తేను. పద్మ ఎంతకని చేసి పెడ్తుంది. పద్మ ఈ యింటి కోడలు. మన యింటి ఆడపడుచు కాదు. అన్నీ క్రాంతి చెల్లాయిలా నాన్న కదాని చేసి పెట్టడానికి. ఆమెకూ కోరికలుంటాయి. ఉద్యోగం చేస్తున్న భర్త దొరికాడని చేసుకుందే గానీ పార్టీ వాళ్ళందరికి వండిపెట్టడానికి కాదు...''

'' సూర్యం.. అలా అనకు. చెల్లెలు క్రాంతికి పెళ్ళయిపోయింది. ఇప్పుడు తాపతాపకు ఇక్కడకు రాలేదు. నాన్నకున్న మంచితనం గురించి ఆలోచించు. ఆ మంచితనం నీకు ఏదో రూపంలో మేలు చేస్తుంది.''

'' అక్కా! కాలం మారిందక్కా! ఎవరు మేలు చేసిన్రు చెప్పు. ఆయన రాజకీయాల్లో తిరగబట్టి యిన్నాళ్ళయిందా! నా ట్రాన్స్‌ఫర్ కోసం ఏం చేయగలిగాడు. సిట్టింగ్ ఎమ్మెల్లేను ఆశ్రయించాల్సి వచ్చిందని నీకు తెలియదా!''

''అరే సూర్యం! నాన్నను ఆయన-ఆయన అని అంటవేందిరా! నాన్న అని పిలువలేవా! ఆ ఎమ్మెల్లే మాత్రం మీ నాన్న మంచితనం చూసికదా నీకు మేలు చేసింది. నిజం చెప్పు...''

సూర్యం తప్పు చేసిన వాడిలా తల వంచుకున్నాడు. కాని తండ్రీకొడుకుల మధ్య మామాకోడళ్ళ మధ్య దూరం పెరిగిపోయింది...

ఏమైనా.. మరీ యింత పాషాణంలా ఉండద్దు సూర్యం... యివాళో, రేపో వచ్చి నా ఆశ నిలుపుతావు...

అనుకుంటూ తలవంచుకొని కళ్ళు తుడుచుకుంది విమల. విమల సంకల్ప బలం గట్టిది. కె.కె. కొడుకూ కోడలు రావడం చూసి సంతోషంతో హృదయం తేలికపడింది. కానీ వెంటనే దుఃఖం ఎగదన్నుకొచ్చింది... '' సూర్యం... బాపు... యింకా కండ్లు తెరువలేదురా. బాపు బతుకు....''

ముగ్గురూ ఒక్కసారిగా గొల్లుమని ఏడ్చారు. '' మేడం! దయచేసి కాస్త నిశ్శబ్దంగా ఉండండి.'' అంటూ సిస్టర్ బతిమిలాడింది.

వాళ్ళు రెండు గంటలసేపు కూర్చుని వెళ్ళిపోయాక విమల మళ్ళీ ఒంటరిగా కూర్చుంది.

''అక్కా! రేపు మల్లస్త... లీవు దొరకలేదు.''

'' రేప్పొద్దున కోమాలోంచి తెలివికి వస్తాడంటున్నారు... ఉండరాదూ...'' విమల సూర్యం

కేసి చూసింది.

"రేప్పొద్దున్నే వస్తా అక్కా!"

విమల ఏమీ అనలేకపోయింది.

* * * *

కోమాలోంచి స్పృహలోకి వచ్చాక మెల్లిగా కళ్ళు తెరిచాడు కె.కె. ఆత్రంగా తననే చూస్తున్న విమల కన్పించింది. కె.కె.లో ఆనందం, ఆశ్చర్యం... మెల్లి మెల్లిగా గతం గుర్తుకు రాసాగింది. కొడుకు, కోడలు, కూతురు, అల్లుడు కోసం పార్టీ మిత్రుల కోసం కళ్ళు వెతికాయి. ఎవరూ లేకపోవడం చూసి గుండె కలుక్కుమంది. ఏమీ సంపాదించలేదని, మంచివాన్ని వెతకలేదని కూతురు రాకపోకలు మానేసి చాలా కాలం అయింది. ఇప్పుడెందుకో వస్తుందని ఆశించాడు.

తనకోసం ఒక్కతే కాచుకొని ఉన్న కూతురు లాంటి విమలను చూసి సిగ్గుతో తలవంచుకున్నాడు కె.కె. రాజారాం విమలను వదిలేసినప్పుడు యిదేపనికి ఒడిగట్టబోయినప్పుడు ఓదార్చిన తాను ఈసారి విమలతో చెప్పించుకోవాల్సిరావడం సిగ్గుగా ఉంది.

కాని విమల నోరు పెకలలేదు. పూడుకుపోయిన గొంతుతో కె.కె. ఛాతిపై తల ఆన్చి "బాపూ" అంటూ మూగగా వలవలా ఏడ్చేసింది.

కె.కె. హృదయం కదిలిపోయింది. "బాపూ! ఎందరికో బతుకునిచ్చి ధైర్యాన్నిచ్చిన నువ్వు ఈ పని ఎందుకు చేశావు" అని విమల అడుగుతున్నట్టుగా కె.కె.లో పశ్చాత్తాపం. అంతలో అరుణక్క రావడం గమనించాడు. వస్తూనే అరుణ కె.కె. తలకు తన తల ఆన్చి నిశ్శబ్దంగా రోదిస్తోంది.

ఎప్పుడూ ఏడ్వని కె.కె.కి ఎందుకో ఏడుపు వస్తుంది. మనం ప్రేమను ఆశించిన చోట దొరకనప్పుడు నిరాశ... అనుకోని చోటునుండి ప్రేమ లభించినప్పుడు ఆశ్చర్యం, ఆనందం... నిశ్శబ్దంగా ఏడ్చాడు కె.కె. కన్నీళ్ళు జలజలా ప్రవహిస్తూ చెంపల మీదుగా చెవుల పక్కగా తల కింది దిండును తడుపుతున్నాయి.

తనకోసం ఏడ్చేవాళ్ళున్నారు. తనకీ విషయం ముందు తట్టివుంటే ఆత్మహత్యకు ఒడిగట్టే వాడు కాదేమో. అరుణ, విమల వారం రోజుల ముందు కల్సి ఉంటే పరిస్థితి యింతదాక వచ్చి ఉండేది కాదేమో. తానైనా వారిని కలుద్దామని ఎందుకనుకోలేకపోయాడు. తనను గౌరవించి ప్రేమించే వారి పట్ల తనకు చిన్నచూపా...? తనని గౌరవించని పార్టీ పెద్దల పట్ల గౌరవమా...? తనని గౌరవించని వారికోసం తాను ఆత్మహత్యకు పాల్పడ్డాడా... తనవారికోసం, తనకోసం ప్రాణం ఇచ్చేవారి కోసం బతకాలని ఎందుకనుకోలేకపోయాడు. కె.కె.లో సంఘర్షణ. తల పగిలిపోతున్నట్టుగా తలనొప్పి. కళ్ళు మూసుకున్నాడు కె.కె. అని పిలువబడే కల్లూరి కోటయ్య.

ఏడుస్తున్నదల్లా తన కళ్ళను తుడుచుకోవడం మరిచిపోయి కొంగుతో కె.కె. కళ్ళను తుడిచింది విమల. "అక్కా!" అంటూ విమలను పొదువుకొని ఏడ్చేసింది అరుణ.

కె.కె.కి స్పృహ వచ్చాక ఉదయ్‌కి ధైర్యం వచ్చింది. "అమ్మా! నేను అలా ఊళ్ళు తిరిగి వస్తాను. మీరు కె.కె.ని చూస్తుండండి" అంటూ ఉదయ్ బయల్దేరాడు.

ఉదయ్‌తో వార్త తెలిసి కె.కె. అభిమానులు చూడ్డానికి రావడం మొదలైంది. హాస్పిటల్ నుండి డిశ్చార్జి చేశాక వారి సంఖ్య పెరిగిపోయింది. కొడుకు కోడలు, కూతురు అల్లుడు చుట్టపు చూపులా వచ్చి చూసిపోయారు. వచ్చిన వారికి టీ, టిఫిన్ల బాధ్యతంతా అరుణ విమలల పైనే పడింది. క్షణం తీరిక లేకుండాపోయింది. కె.కె.ని యిలా ఎందుకు చేశావని ఎవరు అడుగలేదు. కె.కె. అంటే తమకు ఊపిరి. ఉత్తేజం. వారి కళ్ళల్లో ఆశ. వారి రాకే ఒక సందేశం మేం ఉన్నామని.

* * * *

నెల గడిచినా కె.కె.ని పార్టీనుండి బహిష్కరించే ప్రకటన వెలువడలేదు. ఊరూరు తిరిగి కె.కె. అభిమానులందర్నీ కలిశాడు ఉదయ్. వారిలో ముఖ్యులతో కె.కె. యింట్లో సమావేశం ఏర్పాటు చేశాడు. గంటలు గంటలు చర్చలు. అందరి అభిప్రాయాలు విన్నాక తన అభిప్రాయం చెప్పాడు కె.కె.

"పార్టీ వాళ్ళ చేతుల్లో ఉంది. కాని ప్రజలు మన వెంట ఉన్నారు. ఈ విషయం యిప్పుడు వాళ్ళకు కూడా అర్థమై ఉంటుంది. అందువల్ల మనను పార్టీ నుండి బహిష్కరించకపోవచ్చు. పార్టీకే పునరంకితమై మన ప్రజల కోసం పనిచేయడం మంచిది."

కె.కె. అభిప్రాయంతో గుసగుసలు మొదలయ్యాయి. చాలా మంది తల ఊపారు. ఉదయ్‌కు ఆవేశం ఆగడం లేదు.

"ఇంత జరిగాక ఈ పార్టీలో ఉండడం అనవసరం. మనందరి భవిష్యత్తుకు కె.కె. భవిష్యత్తు ఒక ప్రతీక. పార్టీలో రేపు మనకు జరగబోయే సత్కారం యిప్పుడే తెల్సింది. అందువల్ల అందరం మూకుమ్మడిగా రాజీనామా చేసి మనని సాదరంగా ఆహ్వానిస్తున్న జాతీయ పార్టీలో చేరుదాం."

కె.కె. ఆ మాటను అరిగించుకోలేకపోయాడు. "తన జీవితాన్ని యవ్వనాన్ని అర్పించిన పార్టీని వదిలి మళ్ళీ కొత్త జీవితం వెతుక్కోవాలా!" నిరాశ, నిర్వేదం... అతనిలో ఎన్నో జ్ఞాపకాల్ని తట్టిలేపాయి. తాను నమ్మిన విలువల కోసం కొడుకు, కోడలు, కూతురు, అల్లుడు, మరెందరో... బంధువులకు దూరమయ్యాడు. ఇప్పుడు ఉదయ్ తనకు పెద్ద దిక్కు. అందర్నీ కూడగట్టిన ఉదయ్ తనకు భిన్నంగా ఆలోచిస్తున్నాడు. అతని హృదయాన్ని గాయపరచడం తనకిష్టం లేదు. ఎటూ తేల్చుకోలేని ప్రశ్నలు.

అంతదాక మౌనంగా ఉన్న విమల నోరు విప్పి అడిగింది.

" ఉదయ్! మీరు ప్రజల భవిష్యత్తు గురించి ఆలోచిస్తున్నారా? మీ భవిష్యత్తు గురించి ఆలోచిస్తున్నారా?"

"అమ్మా ! ప్రజల కోసమనే ఈ పార్టీలోకి వచ్చినం. పార్టీలో అందుకు తగిన స్థానం కూడా కావాలిగదా!"

"అరే ఉదయ్! ఈ పార్టీ నీకు జన్మనిచ్చి బతుకునిచ్చిన పార్టీ రా! మన యింట్లో నీ పెత్తనం సాగుతలేదని నన్ను వదిలి వేరు పడుతావా?"

"అమ్మా!" ఒక్కసారిగా అరిచాడు ఉదయ్.

విమల మాటలు అందరు ఆసక్తిగా వింటున్నారు.

" నాది ఒకటే ప్రశ్న. ఇన్నేళ్ళు మీరు నిర్మించిన పార్టీనే మీ పార్టీగా మార్చుకోలేని వాళ్ళు కొత్తగా చేరిన పార్టీని మీ పార్టీగా మార్చుకోవడం ఎలా సాధ్యం?"

ఆ ప్రశ్న తామెవరికీ తట్టనందుకు ఆశ్చర్యం. తాను తన వృద్ధాప్యం గురించే తప్ప పార్టీ గురించి ఈ కోణంలో ఎందుకు ఆలోచించలేకపోయాడు అని కె.కె. సిగ్గుపడిపోయాడు.

మరోసారి సమావేశం అయి తుది నిర్ణయం తీసుకుందామని సమావేశం ముగించాడు ఉదయ్. మరుసటి రోజు విమల తన యింటికి వెళ్ళిపోయింది.

* * * *

మూడో సమావేశం తర్వాత ఉదయ్ లేఖ రాశాడు.

"అమ్మా!

నన్ను క్షమించు. నీ ప్రశ్నలు నన్ను పదేపదే వెంటాడుతున్నాయి. మనం నిర్మించిన పార్టీని మన పార్టీగా మార్చుకోలేని అశక్తులం. జీవితమంతా దానికే అర్పించిన కె.కె. కే ఆ పని సాధ్యం కాలేదు. రేపు నా పనీ అంతే కావచ్చు. నేను చేర బోతున్న పార్టీ ద్వారా ప్రజలకు చేయ గలిగిందేమి లేకపోవచ్చు. కాని నాకు నేనుగా ఎదిగి నిరూపించుకోవడం అవసరం. మన పార్టీలో కృషి అంతా పార్టీ పరం అవుతుంది. అందువల్ల పార్టీ నాయకత్వానికి ఎనలేని ప్రాధాన్యత పెరిగి పోయింది. ఈ పార్టీలో ఆ సిస్టమే లేదు. పలుకుబడి ఉన్నవారిని, దానిని సాధించుకున్నవారిని ఎన్నో ఏళ్ళుగా తనలో కలుపుకు పోవడమే ఈ పార్టీ చేస్తున్న పని. ఈ పార్టీలో భావ జాలానికి అనుచరులంటూ తక్కువ. నాయకులకే వారు అనుచరులు. నాయకులు పార్టీ మారితే అభిమానులు పార్టీ మారుతారు. భావ జాలం ప్రాధాన్యత వహించే మన పార్టీలో ఈ అవకాశం లేదమ్మా! అందువల్ల ఎంత కృషి చేసినా మన పార్టీలో నాదంటూ ఒక వర్గాన్ని, గ్రూపును నిలబెట్టుకోవడం కష్టం. దాన్ని రుజువు చేసింది కూడా మీరే. పగలనక రాత్రనక అందర్నీ కలిసి, కదిలించి కె.కె.కు మద్దతు సాధించే కృషి చేసి అందర్నీ ఒక్కటి చేసిన నేనే మీ చర్చల్లో ఒంటరినయ్యాను. అమ్మవైన నువ్వు కూడా నాకు మద్దతు యివ్వలేకపోయావు. రేపూ యింతే...

అమ్మా! నీ ఆవేదన నాకు తెలుసమ్మా! మన పార్టీ మనకు బతుకునిచ్చింది. ఆత్మ విశ్వాసాన్నిచ్చింది. ఆడవాళ్ళను కూడా మనుషులుగా గుర్తించింది. ఈ పార్టీ వల్లే మనకొక యిల్లంటూ ఏర్పడింది. ఇల్లు ప్లాటుతో పాటు, ఇల్లు కోసం సబ్సిడీ, కరెంటు, రోడ్డు, నల్లా అన్నీ వచ్చాయి. ఇప్పుడా ప్లాటు విలువ లక్ష రూపాయలు. ఉద్యోగం చేసినా యింత మంచి ప్లాటు కొనగలిగేవాళ్ళం కాదు.

అమ్మా! నువ్వేసిన ప్రశ్నలు సరైనవే. నీ జవాబులు నీకున్నాయి. కాని నా జవాబులు నేను వెతుక్కుంటున్నాను. ఈ వ్యవస్థ మారాల్సిన దృక్పథం నీకున్నంతగా ఆ పార్టీ ఎమ్మెల్లేకుందా? దాని రాష్ట్ర కమిటికుందా? నీకున్న అవగాహన ముందు ఆ పార్టీ ఏపాటిదిరా? అని ప్రశ్నించావు. అమ్మా నువ్విచ్చిన ఈ ఆత్మవిశ్వాసమే నన్నా పార్టీలో భవిష్యత్తును వెతుక్కోమంటుంది. నేను నేనుగా మిగిలితేనే, ఎదిగితేనే కదా ప్రజలకు మేలు చేయగలిగేది. అందుకని నేను నేనుగా ఎదిగేందుకే కె.కె.ని వదిలి ఈ పార్టీలో చేరడానికి నిశ్చయించుకున్నాను. నన్ను క్షమిస్తావని ఆశిస్తాను. కృతజ్ఞత మనిషికి భారం కాకూడదు! కృతజ్ఞత మన ఎదుగుదలను తినేయకూడదమ్మా! నా నిష్క్రమణ వల్ల తీసుకునే గుణపాఠంతో కె.కె.కి పార్టీలో మేలు జరుగుతుందనే ఆశిస్తాను. ఉంటాను.

-నీ ఉదయ్.

విమల తన కాళ్ళ కింది భూమి కదిలి కూరుకుపోయినట్టుగా వణికిపోయింది. కె.కె. మీదుగా పుట్టిన తుఫాను ఉదయ్‌ను ముంచేసింది. అందరి నడుమ తన కొడుకు బలయ్యాడు. కె.కె.ను కాపాడుకోబోయిన ఉదయ్ తానే బహిష్కృతుడు కావడం... విమలలోని తల్లి మనసు మూగగా రోదించింది.

* * * *

ఈసారి ఎన్నికల్లో కె.కె.కి పార్టీ టికెట్ యివ్వక తప్పలేదు. అప్పటికే పార్టీలో, వెలుపలా కంపు లేసిన కులచర్చకు మరో పరిష్కార మార్గం కనపడలేదు. అవతలి పార్టీ అందుకు దీటుగా

ఉదయ్‌నే తన అభ్యర్థిగా నిలిపింది. ఉదయ్ గెలిచి కె.కె. ఓడిపోయాడు.

" తాతయ్యా! నన్ను ఆశీర్వదించు" అంటూ ఉదయ్ పాదాభివందనం చేశాడు. విమల కళ్ళొత్తుకుంది.

కె.కె. కళ్ళల్లో కన్నీటి బిందువులు... ఒక పక్క జీవితాన్ని ఓడిపోయినంత దుఃఖం, మరోపక్క తనవాడు గెలిచిన ఆనందం.. కె.కె. తన పాదాలమీంచి ఉదయ్‌ని లేవదీస్తుంటే రెండు కన్నీటి బొట్లు ఉదయ్ తల్లో పడి వెచ్చగా యింకిపోయాయి. బిగ్గరగా కౌగిలించుకున్నాడు. ఎందుకో ఉదయ్‌కు గొంతు పెగల్లేదు.

"విడిపోకపోతే మీ ఇద్దరికి టికెట్ వచ్చేది కాదు. ఆ దశలో మీరిద్దరు ఒకే పార్టీలో ఉంటే యిద్దరూ బహిష్కరణకు గురై ఉండేవారు. విడిపోవడమే మీకు మేలు చేసింది. జరిగిందానికి దుఃఖించడంలో అర్థం లేదు" అంది అరుణక్క.

విమల అది నిజమేనని సమాధానపడింది. ఏడాది తర్వాత కె.కె. కన్సుమర్ ఫోరం అఖిల పక్ష కమిటి సభ్యుడుగా నామినేట్ కావడం చూసి అరుణక్క ఆశ్చర్యపోయింది. మరో నెలకు కె.కె. కూతురు చాలాకాలం తర్వాత "నన్ను క్షమించు నాన్నా" అని ఏడిస్తే విస్తుపోయాడు కె.కె. " నీ మంచితనమే నన్ను మహిళా సంఘంలో నామినేటెడ్ సభ్యురాల్ని చేసింది. ఉదయ్ ఇప్పించాడు అంది. ఉదయ్ తనకా విషయమే తెలియదని తప్పించుకున్నాడు. ఈ కొత్తరకం రాజకీయాలేంటో బొత్తిగా తనకు అర్థం కావటం లేదని గొనుక్కున్నాడు కె.కె.

ఉదయ్ గెలవడంతో కె.కె. ఓడిపోయిన జీవితాన్ని అనూహ్యంగా తిరిగి గెలుచుకోవడం ప్రారంభించాడు. పార్టీలో, మిత్రుల్లో, బంధువుల్లో అతనికి మునుపెన్నడూ లేనంత ఆదరణ పెరిగింది. కానీ అనుకోనివైపు నుండి దెబ్బ తగిలి అవాక్కయ్యాడు కె.కె...

"బాపూ! మనవాడొకడు వేరే పార్టీలో ఉంటే ఇట్లా మనక్కూడా మేలు జరుగుతుందని పిస్తుంది. కొన్ని కులాల వాళ్ళు మన పార్టీలో యింతకాలం పొందిన స్థానాలకు గల కిటుకులేమిటో ఇప్పుడు కాస్త తెలుస్తుంది. అందుకని నేను మరో పార్టీలో చేరుతున్నాను. మన పార్టీకి రాజీనామా చేస్తున్నందుకు క్షమించు బాపూ...." అంది అరుణ.

సామాజిక ఉద్యమాల సేవే తప్ప రాజకీయం తెలియని కె.కె. పదవుల కోసం యువతరం చెడిపోతున్నదని అరుణని నిందించాడు. విమల ఒక్కర్తయినా మిగిలినందుకు కాస్త ఊరట చెందాడు.

అయితే అరుణకు ఎమ్మెల్లే తల్లి విమలే మద్దతును ధైర్యాన్ని యిచ్చింది. ఈ విషయం తెలిస్తే కె.కె. గుండె ఆగిపోతుందని ఆ విషయం బయటికి పొక్కనీయలేదు విమల.

తన పార్టీ తల్లిపాలు తాగిన వాళ్ళు ఏ పార్టీలోనైనా నెగ్గుకు రాగలరని విమలకు కొడుకును చూశాక ఆమెకు ఎందుకో దృఢ విశ్వాసం కలిగి ఆ సూచన చేసినట్టుంది.

అరుణక్క పార్టీ మారుతుందని తెలిసి ఉదయ్‌కు ఎందుకో బాధనిపించింది. అమ్మే ఇందుకు సూత్రధారి అని తెలిసి విస్తుపోయాడు.

"అమ్మా! మన కన్నతల్లి పార్టీ ఎంత బలంగా వుంటే అంత మేరకే ఈ పార్టీలో నాకు గౌరవం. ఆ పార్టీ బలహీన పడితే ఈ పార్టీలో నా స్థానం కూడా బలహీనపడ్తుంది. రష్యాలో సోషలిజం పడిపోయాక ప్రపంచమంతా సోషలిజానికి, సోషలిస్టు భావనకు ఎదురైన ప్రమాదం మీకు తెల్సు. అరుణక్క పార్టీ మారడం ఆమెకు కూడా మేలు చేయదు."

కొడుకుకు కలిగిన కొత్త అనుభవానికి తల్లి విమల విస్తుపోయింది.

" అమ్మా! కె.కె. కు స్థానం కోసం నేను పార్టీని వదిలాను. ఇదొక రాజకీయం. నేను

ఓడిపోయి కె.కె.ను గెలిపించుకోవాలనుకున్నాను. కాని తర్వాత నేను గెలిచి కె.కె. జీవితాన్ని గెలిపించుకోవాల్సి వచ్చింది. అదొక చారిత్రక దశలో కర్మనిలా అనివార్య క్రమం. కాని అరుణక్కా! మరి నీవు ఎవరి కోసం పార్టీని వదిలేయాలనుకుంటున్నావు? "

గంటసేపు రకరకాలుగా ప్రశ్నించి భవిష్యత్తును అంచనా వేసి అరుణక్క ముందుంచాడు ఉదయ్. అరుణక్క అవాక్కయింది. కె.కె. బలం ఉదయ్ ఎదుగుదల మీద ఆధారపడి ఉంటే, ఉదయ్ స్థానం తమ పార్టీ ఎదుగుదలపై ఆధారపడి ఉందని ఉదయ్ చెప్పడం విచిత్రంగా అనిపించింది అరుణకు.

రెండు పార్టీల్లోను తామే నాయకత్వంలో ఉన్నప్పుడే ఇరుపక్షాల్లోను గౌరవం ఉంటుంది. అరుణక్క తన నిర్ణయంపై పునరాలోచనలో పడింది.

❋ ❋ ❋

**సుప్రభాతం (వార పత్రిక) ఆగస్టు,1999**